సాక్షి నంద్యాల

ఆదివారం । 31 । మార్చి । 2024



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలోని నిత్య కళారాధన వేదికపై శనివారం నిజామాబాద్‌కు చెందిన కర్ణం శ్రీనివాస్ వారి కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



వైభవంగా మధ్యారాధన

మంత్రాలయం: శ్రీమఠం పూర్వపు పీఠాధిపతి సుయతీంద్రతీర్థుల మధ్యారాధన వేడుకలు శనివారం వైభవంగా సాగాయి. మూల బృందావనానికి విశేష పూజలు నిర్వహించారు.



ఒక్కరోజు.. రూ.5.43 లక్షలు

బేతంచెర్ల: శ్రీలక్ష్మీ గణమద్దిలేటి నరసింహస్వామి క్షేత్రానికి శనివారం రూ. 5,43,225 ఆదాయం వచ్చింది. భారీగా తరలివచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు.

	ఇఫ్తార్	సహర్
కర్నూలు	సా॥ 6:34	ఉ॥ 4:48
ఆదోని	సా॥ 6:37	ఉ॥ 4:51
నంద్యాల	సా॥ 6:34	ఉ॥ 4:45
ఆత్మకూరు	సా॥ 6:32	ఉ॥ 4:46
బనగానపల్లె	సా॥ 6:35	ఉ॥ 4:46

రంజాన్ వేళలు

హదీస్ వెలుగు :

ఉపవాస దీక్షలు పాటించేవారి పట్ల మృదు స్వభావం కలిగి ఉండండి. వారి పట్ల కఠినత్వం చూపే వారి పట్ల అల్లాహ్ కూడా కఠినంగా ఉంటాడు.

– పవిత్ర ఖురాన్



నంద్యాల మేమంతా సిద్ధం సభలో వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలు



నంద్యాల సభలో ర్యాంప్‌పై నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు శిల్పా చక్రపాణిరెడ్డి, దారా సుధీర్, శిల్పా రవి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని రామిరెడ్డి, గంగుల నాని, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

ఈ గట్టున ఉత్సాహం.. ఆ గట్టున నిస్తేజం

- ఎన్నికల వేళ ఊపందుకున్న పార్టీల ప్రచారం
- ఉమ్మడి జిల్లాలో వైఎస్ జగన్ బస్సు యాత్ర విజయవంతం
- వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపిన 'మేమంతా సిద్ధం' సభలు
- చంద్రబాబు సభలకు కదలని జనం
- బనగానపల్లెలో ప్రజాగళం సభ అట్టర్ ఫ్లాప్
- ఆత్మకూరు, నందికొట్కూరులో సభలు వాయిదా
- టీడీపీ నాయకుల్లో ఆందోళన



బనగానపల్లె సభలో చంద్రబాబు ప్రసంగిస్తుండగా మధ్యలోనే వెనుదిరిగిన కార్యకర్తలు

సాక్షి, నంద్యాల: సార్వత్రిక ఎన్నికల నగారా మోగడంతో జిల్లాలో రాజకీయం వేడెక్కింది. మండుటెండలను సైతం పక్కకు తోసేసి ఎన్నికల హీట్ రోజురోజుకు పెరుగుతోంది. మే 13న అసెంబ్లీతో పాటు లోక్‌సభకు ఒకే సారి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రచారం ఊపందుకుంది. రాష్ట్రంలో ప్రధాన పార్టీలైన వైఎస్సార్‌సీపీ, టీడీపీ మధ్యే ఎన్నికల వార్ నడుస్తోంది. దీంతో ఇరు పార్టీల అధినేతలు క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీకి కంచుకోట. 2019 ఎన్నికల్లో 14 నియోజకవర్గాల్లోనూ ఫ్యాన్ గాలి వీచింది. టీడీపీ అభ్యర్థులు చిత్తుగా ఓడిపోయారు. 2024 ఎన్నికల వేళ అదే ఊపు కనిపిస్తోంది. ఇప్పటికే సిద్ధం సభలతో సత్తా చాటిన సీఎం వైఎస్ జగన్.. ఈ నెల 27వ తేదీ నుంచి ఇడుపులపాయ నుంచి 'మేమంతా సిద్ధం' పేరుతో బస్సుయాత్రకు శ్రీకారం చుట్టారు. యాత్రలో భాగంగా రెండో రోజే నంద్యాలలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. సభకు లక్షలాది మంది ప్రజలు తరలివచ్చి తమ మద్దతు తెలియజేశారు. మూడో రోజు ఎమ్మిగనూరులో నిర్వహించిన సభకు ప్రజలు పోటెత్తారు. నంద్యాల, ఎమ్మిగనూరు సభలు ఒకదానికి మించి మరొకటి సూపర్ హిట్ కావడంతో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఫుల్ జోష్‌లో ఉన్నారు.

నీరసించిపోతున్న టీడీపీ

మరోవైపు టీడీపీ అధినేత చంద్రబాబు ఎక్కడ సభలు పెట్టినా విఫలమవుతున్నాయి. ముందుగా వెల్లడించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 29న ఆత్మకూరు, నందికొట్కూరులో ప్రజాగళం సభలు నిర్వహించాల్సి ఉంది. రెండు నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ ఎంతో బలంగా ఉంది. టీడీపీ చాలా బలహీనంగా ఉండడంతో జిల్లాలో నిర్వహించే మొదటి సభే ఫ్లాప్ అయితే బాగోదన్న ఉద్దేశంతో సభను బనగానపల్లెకు మార్చారు. మిట్ట మధ్యాహ్నం సభ పెట్టడంతో వచ్చిన అరకొర మంది తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. బస్సులు పెట్టి జిల్లా వ్యాప్తంగా ప్రజలను తరలించినా సభలో పాల్గొనేందుకు వారు ఆసక్తి చూపించలేదు. ఓ వైపు వైఎస్సార్‌సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్ సభలకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివస్తున్నారు. సొంత ఖర్చులు పెట్టుకుని అధినేత వెంటే తామంతా నడుస్తామనే సంకేతాలిస్తున్నారు. దీంతో సభలు ఎక్కడ పెట్టినా ఇసుకేస్తే రాలనంతలా జనాలు వస్తున్నారు.

ఆత్మస్థైర్యం కోల్పోతున్న టీడీపీ

ఉమ్మడి కర్నూలు జిల్లా వైఎస్సార్ సీపీ కంచుకోట. ఈ ఎన్నికల్లోనైనా నామమాత్రపు పోటీ ఇద్దామనుకుంటున్నా.. టీడీపీకి నిరాశే ఎదురవుతోంది. వైఎస్సార్‌సీపీ ఎక్కడ సభ పెట్టినా జనాలు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేస్తున్నారు. మరోపక్క డబ్బులు ఖర్చు పెట్టి జనాలను తరలిస్తున్నా తమ అధినేత సభలకు ప్రజలు రావడం లేదన్న నిస్తేజంలో టీడీపీ కార్యకర్తలున్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు నిర్వహిస్తున్న సభల ముందు తమ సభలు తేలిపోతున్నాయని టీడీపీ శ్రేణులే చర్చించుకుంటున్నాయి. సభలను బట్టి చూస్తే మళ్లీ ఓటమి తప్పదనే ఆందోళనలో ఆ పార్టీ కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులు ఉన్నారు.

మరోవైపు చంద్రబాబు సభలకు ఉచిత బస్సులతో పాటు బిర్యానీ, మందు ఇచ్చి జనాలను తరలిస్తున్నారు. మహిళలకు, వృద్ధులకు డబ్బులు సైతం ఇచ్చి సభకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. అయినా చంద్రబాబు సభలు జనాలు లేక వెలవెలబోతున్నాయి. బహిరంగ ప్రదేశాల్లో పెడితే జనాలు లేరన్న విషయం స్పష్టంగా తెలిసిపోతుందన్న భయంతో ప్రధాన రోడ్లపై.. ఇరుకు వీధుల్లోనే సభలు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది.

ఆళ్లగడ్డ సీన్ బనగానపల్లెలో పునరావృతం

'రా కదలిరా' పేరుతో చంద్రబాబు గత నెల ఫిబ్రవరిలో ఆళ్లగడ్డలో బహిరంగ సభ నిర్వహించారు. సభకు లక్ష మందికిపైగా తరలించాలని ఆయా మండలాల నాయకులకు లక్ష్యాన్ని ఇచ్చారు. దీంతో నాయకులంతా భారీగా బస్సులు, వాహనాలు, లారీలలో జనాలను తరలించేందుకు ప్రయత్నించారు. చివరకు ఆ సభకు పట్టమని పదివేల మంది కూడా రాలేదు. సభ ఫెయిల్ కావడంపై అప్పట్లో చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మళ్లీ షెడ్యూల్ విడుదలయ్యాక నంద్యాల జిల్లాలో మొట్ట మొదటిసారిగా ప్రజాగళం పేరుతో 29వ తేదీన బనగానపల్లెలో నిర్వహించిన సభకు జనాలు ముఖం చాటేశారు. దీంతో పట్టణంలో జనాలు ఎక్కువగా ఉండే పెట్రోల్ బంక్ కూడలిలో సభ పెట్టి మమ అనిపించారు.

న్యూస్‌రీల్

అభ్యంతరకర పోస్ట్‌లు పెడితే అడ్మిన్‌లదే బాధ్యత



జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: వాట్సాప్ గ్రూపుల్లో ఎవరైనా అభ్యంతరకర పోస్టులు పెడితే ఆ గ్రూప్ అడ్మిన్‌లే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి శనివారం ప్రకటనలో హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో సోషల్ మీడియా ట్రోలింగ్‌లపై ప్రత్యేక నిఘా ఉంచామని ఎస్పీ వివరించారు. కుల, మత, వర్గాల మధ్య విబేధాలు, విద్వేషాలు రెచ్చగొట్టేలా ఏవైనా పోస్టు పెడితే తీవ్రమైన చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు. వాట్సాప్ గ్రూప్‌లో యాడ్ చేసిన ప్రతి సభ్యుడు అడ్మిన్‌కు తెలిసి ఉండాలని, ఎవరైనా సభ్యుడు ఇబ్బందికర పోస్టులు గ్రూప్‌లో ఉంచితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాంటి సభ్యులను గ్రూపుల నుంచి వెంటనే తొలగించాలని సూచించారు. అడ్మిన్ జాగ్రత్త వహించకపోతే ఐపీసీ సెక్షన్ 153ఏ కింద 3 నుంచి 5 ఏళ్ల జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుంది. వాట్సాప్ గ్రూప్‌లో తెలిసి తెలియని తప్పుడు సమాచారం పోస్ట్ చేసిన లేదా మార్ఫింగ్ చేసిన చిత్రాలు పోస్ట్ చేసి వేధింపులకు గురిచేసిన పోలీస్ వాట్సాప్ నెంబర్ 9154987034కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

టీడీపీ నేతపై కేసు నమోదు

బొమ్మలసత్రం: ఎన్నికల నియమావళిని ఉల్లఘించిన టీడీపీ పార్లమెంట్ కమిటీ కార్యదర్శి ఎస్ఎమ్‌డీ ఫిరోజ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. మూడు రోజుల క్రితం ఫిరోజ్ స్థానిక 24వ వార్డులోని కంసాలిపేటలో స్థానికులకు శంఖారావం కిట్లను పంపిణీ చేశారు. దీనికి సంబంధించిన వీడియో, ఫొటోలు సోషల్ మీడియాలో ప్రసారమయ్యాయి. ఈ నేపథ్యంలో డిప్యూటీ తహసీల్దార్ ఆదేశాల మేరకు ఫిరోజ్‌పై కోడ్ ఉల్లంఘన కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రాజారెడ్డి పేర్కొన్నారు.

అన్నదాన పథకానికి రూ.2లక్షల విరాళం



విరాళాన్ని అందజేసిన హైదరాబాద్‌కు చెందిన చౌదరిని జ్ఞాపికతో సత్కరిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి పలువురు భక్తులు రూ.2 లక్షల విరాళం అందించారు. శనివారం హైదరాబాద్‌కు చెందిన ఆర్.వి.ఆర్.చైదరి రూ.1,11,114 విరాళాన్ని ఆలయ పర్యవేక్షకురాలు టీ.హిమబిందుకు అందజేశారు. అలాగే బెంగళూరుకు చెందిన దువ్వూరి వ్యాఘ్రి రూ.1,01,116 విరాళాన్ని ఆలయ ఏఈవో ఫణిధరప్రసాద్‌కు అందజేశారు. విరాళాలు అందజేసిన దాతలకు దేవస్థానం తరుపున స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): ఈ నెల 18వ తేదీన ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు శనివారం ప్రశాతంగా ముగియడంతో విద్యాశాఖ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. నంద్యాల జిల్లాలో 134 కేంద్రాల్లో 30,242 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, అడిషనల్ డిపార్టుమెంట్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఇన్విజిలేటర్ల సమన్వయంతో పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ప్రతి కేంద్రంలో బెంచీలపై పరీక్షలు రాసేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎక్కడా పేపర్ లీకేజీకి ఆస్కారం లేకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. చివరి రోజు శనివారం వృత్తి విద్య పరీక్షకు 30 కేంద్రాల్లో 3,259 మంది విద్యార్థులకు గాను 3,145 మంది హాజరయ్యా౨. 144 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

ఉగాది మహోత్సవాలు ఘనంగా నిర్వహించండి

- జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు



ఈఓతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: శ్రీశైల మహా పుణ్యక్షేత్రంలో ఉగాది మహోత్సవాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు శ్రీశైల దేవస్థానం ఈఓను ఆదేశించారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో వచ్చేనెల 6 నుంచి 10వ తేదీ వరకు జరిగే ఉగాది మహోత్సవాల ఏర్పాట్లపై దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు కలెక్టర్‌తో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉగాది మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి జిల్లా యంత్రాంగం నుంచి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రధానంగా తాగునీరు, పారిశుద్ధ్యం, పార్కింగ్ ప్రదేశాలు, భక్తుల దర్శన క్యూలైన్లు, లడ్డూ ప్రసాద కౌంటర్లు తదితరాలపై దృష్టి సారించి ఆ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి జిల్లా అధికారులతో ఏప్రిల్ 1వ తేదీన భౌతిక సమావేశం ఏర్పాటు చేసి అధికారులకు ఆదేశాలు ఇస్తామని కలెక్టర్ తెలిపారు.

రేపటి నుంచి 'పది' మూల్యాంకనం

- సౌకర్యాల మధ్యన 'స్పాట్'

నంద్యాల(న్యూటౌన్): పదో తరగతి పరీక్షలు ముగియడంతో విద్యాశాఖ వెంటనే మూల్యాంకనానికి చర్యలు చేపట్టింది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి పాణ్యం సమీపంలోని ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో అధికారులు స్పాట్‌కు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే వివిధ జిల్లాల నుంచి తెలుగు, ఇంగ్లిష్, గణితం, సైన్స్ జవాబు పత్రాలు రాగా వాటిని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. ఈ ప్రక్రియ ఏప్రిల్ 8వ తేదీ వరకు కొనసాగనుంది. రాష్ట్రంలోనే మొదటి సారిగా పూర్తిగా ఎయిర్ కండీషన్ గదులలో స్పాట్ నిర్వహిస్తున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి సుధాకర్‌రెడ్డి స్పాట్ క్యాంప్ ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు. ఈయన పరిధిలో ఇద్దరు డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్లు ఉంటారు. వారి కింద అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లు, చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్‌లు ఉంటారు. జవాబు పత్రాలు దిద్దే విషయంలో అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్‌లు కీలకంగా ఉంటారు. ఏఈలు దిద్దిన జవాబు పత్రాలను స్పెషల్ అసిస్టెంట్‌లు మరోసారి పరిశీలించి మార్కుల వివరాలను ధ్రువీకరిస్తారు. పొరపాటున ఏఈల చేతుల్లో టోటలింగ్‌లో తక్కువ వచ్చిన అంశాలను స్పెషల్ అసిసెట్టంట్‌లు గుర్తించిన సందర్భాలు ఉన్నాయి. సీఏలు కూడా ర్యాండమ్‌గా కనీసం మూడు జవాబు పత్రాలను పరిశీలిస్తారు.

పకడ్బందీ ఏర్పాట్లు

విద్యార్థుల భవిష్యత్తుకు ముడిపడిన అంశం కావడంతో మూల్యాంకనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. జిల్లాకు దాదాపు 2 లక్షల జవాబు పత్రాలు వచ్చాయి. 58 ఏళ్లు పైబడిన ఉపాధ్యాయులకు స్పాట్ విధుల నుంచి మినహాయింపు ప్రభుత్వం కల్పించింది. ఈ వయసు టీచర్లలో ఎవరైనా ఆసక్తి ఉంటే విధులకు తీసుకుంటున్నారు. ఇప్పటికే అన్ని సబ్జెక్టుల టీచర్ల సీనియారిటీ జాబితాను డీఈఓ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచాం. జాబితాపై ఏవైనా అభ్యంతరాలుంటే తెలపవచ్చు.

– సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

అన్నపూర్ణ రథం కదిలివచ్చే



సరుకు సరంజామాతో ఆత్మకూరుకు చేరుకున్న ట్రస్ట్ బృందం

- నాగలూటిలో మహారాష్ట్రీయుల అన్నదాన శిబిరం

ఆత్మకూరురూరల్: శ్రీశైల మల్లికార్జున స్వామి ఉగాది బ్రహ్మోత్సవాలకు పాదయాత్రగా వచ్చే కన్నడీగుల కోసం అన్నదాన శిబిరం ఏర్పాటు చేసేందుకు మహారాష్ట్రీయుల బృందం శనివారం ఆత్మకూరుకు చేరుకుంది. పుష్కర కాలం పైగా నల్లమలలోని నాగలూటి వీరభద్రాలయం సమీపంలో మహారాష్ట కొల్లాపూర్ జిల్లా ఇచ్చలకరంజికి చెందిన శ్రీశైల మల్లికార్జున మల్టీపర్‌పస్ ట్రస్ట్ సభ్యులు అన్నదాన శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు శనివారం సుమారు 300 మంది స్వచ్ఛంద కార్యకర్తలు వాహనాల్లో టన్నులకొద్ది ఆహార సరంజామాతో తరలివచ్చారు. అటవీశాఖ నుంచి తగు అనుమతులు పొందిన తరువాత నేరుగా నల్లమలకు వెళ్లారు. కన్నడ భక్తుల కోసం 24 గంటలు నిరంతరాయంగా అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నామని ట్రస్ట్ నిర్వాహకులు ఎంఎస్ పాటిల్ వివరించారు. సుమారు 7 లక్షలకు పైగా భక్తులు తమ అన్నదాన శిబిరం మీదుగా శ్రీశైలం చేరుకుంటారని తెలిపారు. ఉగాది పర్వదినం వరకు తమ అన్నదాన శిబిరం సాగుతుందని చెప్పారు.

క్లుప్తంగా

మహానందికి జాతీయస్థాయి గుర్తింపునకు కృషి



మహానందికి వచ్చిన ఇంటాచ్ సంస్థ ప్రతినిధి, నిపుణులు

మహానంది: మహానందిలోని జలసంపద అద్భుతమని, జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని ఢిల్లీకి చెందిన ఇంటాచ్ (ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్స్ కల్చర్ అండ్ హెరిటేజ్) సంస్థ ప్రతినిధి సుమేష్ దుదాని తెలిపారు. మహానందిలోని కోనేరులు, అందులోని జలసంపదను వారు శనివారం మిషన్ ఆన్ వాటర్ ప్రాజెక్ట్, సెంట్రల్ గవర్నమెంట్ తరపున పరిశీలనకు వచ్చారు. బృందం ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. నంద్యాల చాప్టర్ కన్వీనర్, ఫ్యాక్టరీస్ డైరెక్టర్ ఎంవీ శివకుమార్, సభ్యులు డాక్టర్ కిషోర్‌కుమార్, సుదర్శనం, చంద్ర, పల్లా నాగరాజు, రమేష్, తదితరులతో కలిసి కోనేరులను, నీటి సంపదపై పలు వివరాలను సేకరించారు. నీరు ఎక్కడి నుంచి వస్తుంది? ఎన్ని అడుగుల మేరకు ఉంది, ప్రవాహపు తీరు, తదితర అంశాలపై వారు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేద పండితులు రవిశంకర అవధాని, తదితరులతో చర్చించారు. అనంతరం వారు కేసీ కెనాల్ పరిశీలనకు వెళ్లారు. వీరు ఇప్పటికే ధవళేశ్వరం, పోరుమామిళ్ల, కంభం చెరువులను పరిశీలించినట్లు డాక్టర్ ఎంవీ శివకుమార్ రెడ్డి తెలిపారు.

వేసవి తీవ్రతతో జాగ్రత్త

నంద్యాల టౌన్: వేసవి ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయిలో పెరుగుతున్న కారణంగా వడదెబ్బకు గురికాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఉష్ణోగ్రతలపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూ జాగ్రత్తలు పాటించాలన్నారు. అత్యవసర సమయాల్లో తప్ప బయటకి వెళ్లకూడదన్నారు. ఒకవేళ బయటకు వెళ్లాల్సి వస్తే తెలుపు కాటన్ వస్త్రాలు ధరించి, తలకు టోపీ లేదా రుమాలు కట్టుకోవాలన్నారు. తరచుగాగా నీళ్లు, మజ్జిగ సేవించాలన్నారు. వడదెబ్బకు గురైన వారు సాధారణ స్థితికి రానిచో, దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి అవసరమైన చికిత్స చేయించాలన్నారు. తీవ్రమైన ఎండలో బయటకు వచ్చినప్పుడు తల తిరుగుట, వాంతులు ఇతర అనారోగ్య సమస్యలు ఏర్పడితే వెంటనే దగ్గరలోని వైద్యుని సంప్రదించాలన్నారు. చల్లదనం కోసం ఇంటి పైకప్పులపై వైట్ పెయింట్, కూల్ రూఫ్ టెక్నాలజీ ద్వారా ఇంటి వాతావరణాన్ని చల్లగా ఉంచుకోవాలన్నారు.

ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత మహిళలకు ఎంబ్రాయిడరీ(జర్దోసి మగ్గం), ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ తెలిపారు. ఏప్రిల్ 18 నుంచి 30 రోజుల పాటు శిక్షణకు 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు చదవడం, రాయడం వచ్చిన మహిళలు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 63044 91236సంప్రదించాలన్నారు.

రూ.5.25 లక్షల అపరాధ రుసుం వసూలు

కర్నూలు (న్యూటౌన్): అక్రమంగా ఖనిజ రవాణాకు పాల్పడిన కేసులో వాహనాలకు సంబంధించి రూ.5.25 లక్షలు అపరాధ రుసుం వసూలు చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోసిగిలో సీజ్ చేసిన హిటాచీ నుంచి రూ.50 వేలు, నూతనపల్లె దగ్గర అక్రమ గ్రావెల్ తరలిస్తుండగా సీజ్ చేసిన మూడు టిప్పర్ల నుంచి రూ.2.5 లక్షలు అపరాధ రుసం వసూలు చేసినట్లు పేర్కొన్నారు.



తేరుపై తేజోమూర్తి



గోరంట్ల గ్రామం భక్తజనసంద్రమైంది. గోవింద నామస్మరణ మారుమోగింది. గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ మాధవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం రథోత్సవం కనులపండువగా సాగింది. తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. – కోడుమూరు రూరల్

దళితులకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలి



విలేకరుల సమావేశంలో రామాంజనేయులు, కల్లుపోతుల సురేష్ తదితరులు

- టిప్పర్ డ్రైవర్, ఉపాధి కూలీకి ఎమ్మెల్యే టిక్కెట్‌లు ఇవ్వడం నేరమా?
- అనుచిత వ్యాఖ్య చేయడం తగదు
- ఎన్నికల్లో ఎస్సీల సత్తా చూపిస్తాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్ష, కార్యదర్శులు

ఆదోని రూరల్: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు దళితులకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లుపోతుల సురేష్ డిమాండ్ చేశారు. ఆదోని పట్టణంలోని పెద్దకడబూరు మాజీ ఎంపీపీ రఘురామ్ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శనివారం వారు మాట్లాడారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో భాగంగా అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గానికి వెళ్లి టిప్పర్ డ్రైవర్ అయిన వీరాంజనేయులకు వైఎస్సార్‌సీపీ టికెట్ ఇవ్వడంపై అవహేళన చేశారన్నారు. దళితుల మనోభావాలను దెబ్బతీశాడన్నారు. భేషరతుగా క్షమాపణ చెప్పని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామన్నారు. అలాగే అనంతపురం జిల్లాలో మడకశిర నియోజకవర్గ టికెట్‌ను ఎస్సీ వర్గానికి చెందిన వీరలక్కప్ప అనే ఉపాధి కూలీకి ఇవ్వడంపై వ్యంగ్యంగా మాట్లాడి ఎస్సీలను కించపరిచారన్నారు. డబ్బున్న వారికి టికెట్లను అమ్ముకునే సంస్కృతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేదన్నారు. నిరుపేదలను అందలం ఎక్కించేందుకే టికెట్లు ఇచ్చారన్నారు. రాష్ట్రంలో 200 అసెంబ్లీ, ఎంపీ స్థానాలు ఉండగా 100 స్థానాలను ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు వైఎస్సార్‌సీపీ టికెట్లను కేటాయించిందన్నారు. కేబినెట్‌లోనూ 50 శాతం ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు మంత్రులుగా ఉన్నారని గుర్తు చేశారు. చంద్రబాబు పెత్తందారులకు పెద్దపీట వేస్తే.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలను అందలం ఎక్కించారన్నారు. పెత్తందారులు, పేద వర్గాల మధ్య ఎన్నికలు జరుగుతున్నాయని, పేదలు గెలిచేలా ప్రతి ఒక్కరూ తీర్పు ఇవ్వాలని కోరారు. విలేకరుల సమావేశంలో కౌన్సిలర్ చిన్న, పెద్దకడబూరు మాజీ ఎంపీపీ రఘురామ్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి దినేష్ పాల్గొన్నారు.

న్యాయమూర్తులకు వర్క్‌షాప్





వర్క్‌షాప్ నిర్వహిస్తున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేష్‌రెడ్డి, హాజరైన న్యాయమూర్తులు

కర్నూలు (లీగల్): కర్నూలు జిల్లా కోర్టులో న్యాయమూర్తులకు శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేష్‌రెడ్డి నేతృత్వంలో కర్నూలు జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న న్యాయమూర్తులకు సివిల్ సూట్లపైన రివ్యూ నిర్వహించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ జ్యూడీషియల్ అకాడమి అదనపు డైరెక్టర్ చక్రవర్తి, విశ్రాంతి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శివప్రసాద్, కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు, రివ్యూ సమావేశానికి హాజరైన న్యాయమూర్తులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి ఎ.శ్రీనివాసకుమార్, ఆదోని రెండవ వాదనపు న్యాయమూర్తి సుధ, నంద్యాల మూడవ అదనపు న్యాయమూర్తి వాసు, కర్నూలు జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి పాండురంగారెడ్డి, జిల్లా 7వ అదనపు న్యాయమూర్తి రాంభూపాల్‌రెడ్డి, ఏసీబీ జడ్జి సునిత, పర్మనెంట్ లోక్ అదాలత్ న్యాయమూర్తి హరినాథ్, జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న న్యాయమూర్తులు హాజరయ్యారు.

మినీట్రక్కు బోల్తా.. ఒకరు మృతి



బోల్తాపడిన మినీ ట్రక్కు, చిత్రంలో క్షతగాత్రులు

ఆలూరు రూరల్/ఆదోని అర్బన్: వ్యవసాయ కూలీలతో వెళ్తున్న బొలెరో మినీ ట్రక్కు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మస్తానమ్మ (54) అనే వృద్ధురాలు మృతి చెందింది. మరో 18 మంది కూలీలు గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన ఆలూరు మండలం చిప్పగిరి రహదారిలోని హత్తిబెళగల్ బస్టాండ్ వద్ద శనివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. హాలేబీడు గ్రామానికి చెందిన 30 మంది కూలీలు చిప్పగిరి మండలం డేగులహాలు గ్రామ మిరప పొలాల్లో పనులకు వెళ్లి బొలెరో మినీ ట్రక్కులో తిరిగి వస్తున్నారు. ఆలూరు మండలంలోని హత్తిబెళగల్ గ్రామ బస్టాండ్ వద్ద మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో ట్రక్కు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 19 మందికి గాయాలయ్యాయి. ఇందులో మస్తానమ్మ, శేఖమ్మ, దస్తగిరమ్మ, రమీజా, జైనాబీ, ఖాజాబీ, మహబూబ్‌బీలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇందులో తీవ్రంగా గాయపడి ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మస్తానమ్మ కోలుకోలేక మృతిచెందింది. రోడ్డు ప్రమాదం విషయం తెలియగానే రెండు 108 అంబులెన్స్‌లు ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులను ఆదోని ఆస్పత్రికి తరలించాయి.

రోడ్డు ప్రమాదంలో రెండేళ్ల బాలుడు మృతి

- మోటారు సైకిల్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- హుసేనాపురం సమీపంలో దుర్ఘటన



ఘటనా స్థలంలో రోదిస్తున్న మృతుని తండ్రి పరశురాముడు

ఓర్వకల్లు: రోడ్డు ప్రమాదంలో రెండేళ్ల బాలుడు మృతి చెందగా, మరో ఇద్దరు స్వల్పగాయాలకు గురయ్యారు. ఈ దుర్ఘటన హుసేనాపురం వద్ద జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. కన్నమడకల గ్రామానికి చెందిన వడ్డే పరశురాముడు, శిరీష దంపతులు తమ ఇద్దరి చిన్నారులతో కలిసి నంద్యాల మండలం పెద్ద కొట్టాల గ్రామంలో బంధువుల పెళ్లి వేడుకకు హాజరై తిరిగి మోటారు సైకిల్‌పై స్వగ్రామానికి వస్తున్నారు. హుసేనాపురం గ్రామ సమీపంలో ఎస్సార్ పెట్రోల్ బంకు వద్ద మోటారు సైకిల్‌ను వెనుక నుంచి కర్నూలుకు వెళ్తున్న ఆళ్లగడ్డ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా బైక్ అదుపు తప్పి కిందుపడింది.పరశురాముడు, శిరీష దంపతులకు స్వల్పగాయాలు కాగా.. వారి రెండేళ్ల కుమారుడు పవన్ తల పైభాగం చర్మం లేచిపోయి తీవ్ర రక్తస్రావం అయ్యింది. సమీపంలోని ఆసుపత్రి తీసుకెళ్లగా కోలుకోలేక బాలుడు మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద తీరును పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన బస్సును స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు.

శ్రీశైల ఆలయ ఉద్యోగి నిర్వాకం

- టికెట్లు లేకుండా గర్భాలయ అభిషేకాలు
- భక్తుడి నుంచి రూ.24 వేలు తీసుకున్న వైనం
- ఆలస్యంగా వెలుగులోకి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనానికి విచ్చేసిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ భక్తుడిని శ్రీశైల ఆలయ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి నిలువునా మోసం చేశాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈనెల 24వ తేదీన కాశీకి చెందిన ఓ భక్తుడు తన భార్య, ముగ్గురు పిల్లలతో శ్రీశైలం చేరుకున్నాడు. ఇందుకోసం వారికి తెలిసిన వారి ద్వారా దేవస్థానంలో స్వామివారి ఆలయ రూ.500 టికెట్ గేట్ వద్ద విధులు నిర్వహించే ఉద్యోగిని ఆశ్రయించాడు. సదరు ఉద్యోగి వారికి వసతి గదిని కేటాయించి, అదే రోజు రాత్రి ఎటువంటి టికెట్లు లేకుండా స్వామివారి అలంకార దర్శనం చేయించాడు. మరుసటి రోజు సోమవారం ఉదయం 5.30 గంటలకు ఆలయంలోకి ఎటువంటి టికెట్లు లేకుండా తీసుకువచ్చి గర్భాలయ అభిషేకం, వారి కుటుంబ సభ్యులకు స్పర్శ దర్శనం, అమ్మవారి ఆలయంలో ఆశీర్వచనం చేయించాడు. అనంతరం బయటికి వచ్చిన భక్తుడి నుంచి రూ.24 వేలు వసూలు చేశాడు. కాగా సదరు భక్తుడు సొంతూరికి వెళ్లిన తర్వాత గర్భాలయ అభిషేకంలో అభిషేక కిట్ (స్వామివారి శేషవస్త్రం, కుంకుమ, విభూది, లడ్డూ ప్రసాదం, కంకణాలు, కిట్ బ్యాగ్) ఇవ్వలేదని అక్కడి వారికి చెప్పారు. వారు వివరాలు ఆరా తీసి మోసపోయినట్లు తేల్చారు. దీంతో భక్తుడు శనివారం శ్రీశైలంలోని ఓ జర్నలిస్టుకు ఫోన్ చేసి విషయం చెప్పడంతో ఆలయ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి నిర్వాకం వెలుగులోకి వచ్చింది. ఇప్పటికైనా దేవస్థాన అధికారులు తగు విచారణ జరిపించి, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

ఎమ్మిగనూరురూరల్: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక సెబ్ కార్యాలయం ఆవరణలో పట్టుబడిన మద్యాన్ని మీడియాకు చూపించారు. కె.తిమ్మాపురం గ్రామ శివారులో అక్రమంగా కర్ణాటక మద్యం ఉన్నట్లు సమాచారం రావడంతో దాడులు చేశారు. గ్రామానికి చెందిన బోయ ఆశన్న, బోయ గుడిసె సూరన్న, శ్రీరాములు, నల్లబోతుల రంగన్నలను అరెస్టు చేసి వారి నుంచి 768 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



వైద్యశాలలో రాజా హుసేన్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న భూమా కిశోర్‌రెడ్డి

దొర్నిపాడు: ప్రమాదవశాత్తూ విద్యుదాఘతంతో ఓ యువకుడు మృతి చెందాడు. దొర్నిపాడుకు చెందిన దూదేకుల రాజాహుసేన్(36) బేల్దార్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి భార్య కుశాయమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రోజులాగే శనివారం ఉదయం ఊరిలోనే పనులకు వెళ్లాడు. అక్కడ స్లాబ్ పనులకు ఉపయోగించే ఇనుప పైపు పక్కకు తీస్తుండగా ప్రమాదవశాత్తూ పైన ఉన్న విద్యుత్ తీగకు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే స్పృహ కోల్పోయాడు. వెంటనే ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు భూమా కిశోర్‌రెడ్డి, భూమా వీరభద్రారెడ్డిలు వైద్యశాలకు చేరుకొని మృతుడి కుటుంబీకులను పరామర్శించారు. జరిగిన ప్రమాదంపై ఆరాతీశారు. అనంతరం ఆయన మృతుడి కుటుంబీకులకు ఆర్థికసాయం అందించారు.

ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ తనిఖీ



స్ట్రాంగ్‌రూములను పరిశీలించి అనంతరం రాజకీయ నాయకుల ఆధ్వర్యంలో సీల్ వేస్తున్న కలెక్టర్

నంద్యాల: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు తనిఖీ చేశారు. శనివారం టెక్కె మార్కెట్ యార్డు గోడౌన్‌లో భద్రపరచిన ఈవీఎంలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్ వద్ద 24/7 నిరంతర పటిష్ట నిఘా ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఆరు నియోజకవర్గాలకు చెందిన పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈవీఎం అనుబంధ యూనిట్స్ విషయంలో తీసుకున్న భద్రతా పరమైన అంశాలను ఆయన వివరించారు. తదుపరి అక్కడ ఉన్న ఈవీఎం గోడౌన్ సందర్శన రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేస్తూ నిఘా నిరంతరాయంగా ఉండాలని పోలీస్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పార్టీ తరఫున అనిల్ అమృతరాజు, సీపీఎం నుంచి పూల నరసింహులు, సీపీఐ నుంచి రంగనాయుడు, కాంగ్రెస్ పార్టీ నుంచి సయ్యద్ రియాజ్ బాషా, టీడీపీ నుంచి శివరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు

వేసవికాలంలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ కార్యాలయంలో ఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో తాగునీటి సమస్య ఎక్కడ ఏర్పడినా 08514–244424కు కాల్ చేస్తే వెంటనే సంబంధిత అధికారులతో తనిఖీలు చేయించి ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతామన్నారు.

పారదర్శకంగా పోస్టల్ బ్యాలెట్

- జిల్లా సర్వోన్నతాధికారి కె.శ్రీనివాసులు

నంద్యాల(సెంట్రల్): త్వరలో జరిగే సాధారణ ఎన్నికల్లో పాల్గొనే ప్రభుత్వ సిబ్బంది, దివ్యాంగులు, 85 ఏళ్లు పైబడిన వారు, కోవిడ్ బాధితులు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవాలని జిల్లా సర్వోన్నతాధికారి కె.శ్రీనివాసులు సూచించారు. శనివారం ఆయన జిల్లా పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి శివ సత్యనారాయణ, సహాయ నోడల్ అధికారి మంజులా వాణితో తన చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. ప్రతి శాసనసభ నియోజకవర్గ పరిధిలో పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల గుర్తింపు కోసం ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలని, సర్వీసు ఓటర్లకు ఈటీపీబీఎస్ పద్ధతిలో ఓటు హక్కు కల్పించాలని సూచించారు. ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటీ సెంటర్‌లో ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఏదైనా కారణం చేత ఓటు వేయలేకపోతే నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రాల్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. దివ్యాంగులు, 85 సంవత్సరాలు పైబడిన వారి కోసం మొబైల్ పోలింగ్ కేంద్రాల్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది ఫారం–12, అత్యవసర సేవల ఉద్యోగులు, ఇతరులు ఫారం–12డీని రిటర్నింగ్ అధికారికి ముందుగానే సమర్పించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ పొందిన వారు ఎట్టి పరిస్థితుల్లోనూ పోలింగ్ కేంద్రంలో ఓటు వేయలేరని, వీటిని ఇంటికి పంపించమన్నారు.

నియోజకవర్గాల వారీగా వివరాలు

నియోజకవర్గం	నోడల్ అధికారి	సెల్ నంబర్
ఆళ్లగడ్డ	మోహన్ (రుద్రవరం తహసీల్దార్)	8333988891
శ్రీశైలం	విజయకుమారి(వెలుగోడు తహసీల్దార్)	8333988975
నందికొట్కూరు	రాజేంద్రప్రసాద్ (జూపాడు బంగ్లా తహసీల్దార్)	8333988970
నంద్యాల	మల్లికార్జునరెడ్డి (నంద్యాల తహసీల్దార్)	9160682457
బనగానపల్లి	రత్నకుమారి (సంజామల తహసీల్దార్)	8333988986
డోన్	ప్రతాప్‌రెడ్డి (ప్యాపిలి తహసీల్దార్)	8333988965